ఒకరుగా
కలిసిపోయిన
ఆ ఇద్దరూ
వేరువేరుగా
ఎందుకు
బ్రతుకుతున్నారు?

# శ్రీమతి హేమ కథ

# సమాంతర రేఖలు

"ఎన్ని రోజులు కేంప్?"

సూట్ కేస్‌లో తన బట్టలు సర్దుతూ అడిగాను. తలెత్తకుండా "వారం రోజులు" నిలువుటద్దంముందు నిలబడి టై కట్టుకుంటూ చెప్పారాయన.

ఆయన అంటే ఎవరనుకున్నారు?

"నా తలపుల మొగలి పువ్వున గుచ్చి నిలిచిన ముల్లు" వారం రోజులట! వారం రోజులు.

మొదట, మొదట రెండురోజులువుండే కేంప్. ఇప్పుడు నెలలో వారం రోజులవరకూ పెరిగింది. ఇంకొన్ని రోజులు పోతే పదిరోజులూ, ఆ తర్వాత పదిహేను, ఆతర్వాత??

జీవితమంతేనేమో!! ఏమో కావచ్చు. ఆశ్చర్యమెందుకూ? నాకంతలో సడన్‌గా గుర్తుకొచ్చినట్టు డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళి తను ఎప్పుడూ వాడే 'మొఖల్ స్ప్రే' బాటిల్ తీశాను తన సూట్ కేస్‌లో పెట్టడానికి.

"అదెందుకూ?" (మొహం చిట్లిస్తూ ఆ అడగడం ఏంటీ?) పాపం—

"అక్కరలేదా? మీకది లేకుంటే వుండలేరుగా?"

చాలా మామూలుగా చెప్పాను.

చురుక్కుమంటూ నా వెంపు చూశారు. కోపంగాకూడా వుందాచూపు.

నో... అంత తేలికగా నా మనసులోని భావాల్ని చదవనిస్తానా? అందులోనూ నేను. నేను కరుణనుకదా మరి. కరుణ అంటే నాలోని 'కరుణ' గురించి కాదు. నాపేరు కరుణ.



అతను సంకేత్.

పేరులు కలవలేదుకదూ?

మొట్టమొదటిసారిగా అతను నాదగ్గరకు వచ్చినపుడు, నన్ను పెళ్ళిచేసుకుంటానని చెప్పినపుడు—

ఆరోజు—

ఆరోజు బస్టాండ్‌లో నిలబడ్డాను నేను. నేనెక్కవలసిన బస్సు రాకపై

ఎదురుచూస్తూ—

"నాపేరు సంకేత్" ప్రక్కగా నా సమీపంగా ఆ మాటలు వినిపించే సరికి పక్కకు చూశాను.

పేర్లనుబట్టి ఏ ప్రాంతంవారో గుర్తుపట్టే రోజులు పోతున్నాయ్ చూట్టానికి మాత్రం బావున్నాడు.

"నాపేరు 'సంకేత్" మరల చెప్పాడు.

ఓసారతనివెంపు చూసి, ఆ చెప్పేది నాకే అన్న నమ్మకం కలిగేక, "విన్నాను" అన్నాడు. చిరునవ్వుగా.

"మరి... మీ పేరు?"

"చెప్పను" నిజంగానే అలాగే అన్నాను. లేకుంటే ఏవిటటా? ఇలా ఎవరుబడితే వాళ్ళు దగ్గరగా వచ్చేసి పెద్ద పరిచయమున్నట్లుగా పలుకరించేసి, ఆపైన వాళ్ళపేర్లు చెప్పేసుకుని ఆ తర్వాత—

'మీ పేరూ?' అని అడిగేస్తే?

అయ్యో పాపం! వాళ్ళపేరు చెప్పేరుగా అనేసుకుని "హలో! నైస్ టూ మీట్ యూ. ఐయామ్ కరుణా" అనేస్తాననుకున్నాడు గాబోల్ను మానవుడు.

"ఓ మీరు చెప్పరా? పోనీ నేను చెప్పనా? కరుణ. ఓల్డ్‌నేమని చెప్పడానికి ఇష్టపడలేదేమోకదూ మీరు. కరుణ. ఓల్డ్‌నేమే అనుకోండి. అయినా బావుంది. ఎందుకో తెలుసా? మీరు పెట్టుకున్నారు కనుక. బాపూ బొమ్మేసి 'అప్పలమ్మ' పేరెట్టినా ఆ బొమ్మ అందం చెరిగిపోదు. అవునా? అవునుకదూ? అలానే మీ పేరూనూ"

వళ్ళుమండిపోయింది నాకు. తెలుసండీ అడగడం ఎందుకుట? పైగా చాంతాడంత వివరణొహటి. అందుకే కట్టగా (కాస్త మర్యాదగా కూడా ననుకోండి. మరీ కొత్త మొహం. బావుండదనీ—) "సారీ నాపేరు నేను పెట్టుకోలేదు. నా తల్లిదండ్రులు పెట్టారు. చికాగ్గా చెప్పాను. వెధవ బస్సు ఎంతకూ రాదే.

"భలేవారండీ. నాకు 'సారీ' చెప్పడమేంటీ? అయినా అమ్మా నాన్నలు పెట్టేరంటే ఏదో సదుద్దేశంతో పెట్టే వుంటారు. కదూ?

ఆ... బైదిబై. మీరు స్టేట్‌బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. చదువేమో 'బి.కామ్' అంటే మీకు కామ్‌గా వుండడం ఇష్టం. అందుకే 'బి.కాం' డిగ్రీ చేశారుకదూ?"

నాకో క్షణం అనుమానం వేసింది. అందుకే అతనివైపు పరిశీలనగా చూశాను. మహాత్ముడు. ఏ సర్వేకైనా సంబంధించిన శాస్త్రి కాదుగదా? అరే. ఎర్రగడ్డనుండి తప్పిపోయి—?.... కానీ చూడ్డానికి ఆరోగ్యంగా మెంటల్లీ... ఫిజికల్లీకూడా హెల్దీ అన్నట్లుగా కన్పిస్తున్నాడు. వెధవ బస్సు ఇంకా రాదేం. ఆ బోర్‌తోపాటు ఈ బోర్ ఒహటి. అందుకే చికాగ్గా అడిగానా అపరిచితుణ్ణి.

"ఇంకా ఎంతసేపిలా విసిగిస్తారు నన్ను?"

"మీరు నాతో వచ్చేవరకూ" మహా తాపీగా చెప్పాడు.

"ఎక్కడకు?" అదిరిపడి అడిగాను.

"మీ ఇంటివరకు"

నాకర్థంకాలేదు. అదే చెప్పాను

అతనితో.

"ఆ అర్థం చెప్పడానికే పిలుస్తున్నాను. ప్లీజ్ కాదనకండి.. కొన్ని నెలలుగా మిమ్మల్ని గమనించి ఈరోజే నిర్ణయం తీసుకున్నాను. ప్లీజ్" అతని గొంతులో అభ్యర్థన. ఆ పిలుపులో ఆర్తి ఆ చూపులో కాదంటావనే భయం, ఇష్టం.

ఇదేవిటి? ఎలా నా వ్యతిరేకతను వ్యక్తపరచాలి? అయినా... ఇంత తొందరగా కరిగిపోతానా నేను? లేదు. కానీ ఇతని కళ్ళలోవున్న ఆ విపరీతమైన ఆకర్షణ! అసత్యం కాదన్నంత నిజాయితీగా చూస్తున్నాడు. అదీకాదిక్కడ ప్రస్తుతం.

మా చుట్టూ నిలబడిన వాళ్ళంతా మమ్మల్నే గమనించేస్తున్నారు. గొప్ప కుతూహలంతో. ఇది మాత్రం చాలా వికారైన విషయం. అందుకే

'సరే' అన్నట్టుగా ముందుకు కదిలేను ఓ నిర్ణయానికొస్తూ. రెడ్‌మారుతీ డోర్ తెరచి పట్టుకున్నాడు.

"తెరిచింది కారు తలుపైనా స్వాగతించేది హృదయంలోకి?" చాలా పొయిటిక్‌గా అన్నాడు.

కారులో కూర్చోబోతున్నా నేను, ఒక్క క్షణం అతని వెంపు చూశాను.

ఆ క్షణం నాకెందుకో...


నన్ను నేను తొలిసారిగా అతనిలో చూసుకుంటున్నట్లనిపించింది.

మరింకేం సందేహించక ఫ్రంట్ సీట్లో కూర్చున్నా. బస్‌స్టాప్‌లో జనం ఇంకా మమ్మల్నే గమనిస్తున్నారు ఆసక్తిగా.

అతను చాలా జాగ్రత్తగా డోర్ లాక్‌చేసి నా మొహంలోకి వంగి చూస్తూ

"ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటారుకదూ?" అనేసి... కారుముందువెంపునుండి తిరిగివచ్చి డ్రైవింగ్‌సీట్లో నా సరసన కూర్చున్నాడు.

కారు మా ఇంటికి చేరేసరికి అతను తన



గూర్చి, తన కుటుంబసభ్యులగూర్చి చెప్పాడు.

ఏ మధ్యవర్తయినా ఈ మేచ్ గురించి చెప్తే—

బాబోయ్ వారితో మనం తూగగలమా?' అని సందేహిస్తారు నా తల్లిదండ్రులు. మరి చూడాలి ఇప్పుడేమంటారో.

నేను మా ఇంటిదగ్గర కారు దిగేముందు ఒక్కటేమాట అన్నాను. కారు డోర్‌పై చేయి వేసి—

''మనపేర్లు కలవలేదుకదూ?''

అతనోక్షణం నావెంపు ముగ్ధమనోహరునిలా చూసి-

''ఈ క్షణాన్నికూడా గుర్తుపెట్టుకోండేం'' అన్నాడు.

ఆ తర్వాత నెలరోజులకంతా అతను మా ఇద్దరి బంధువుల సమక్షంలో చాలా అట్టహాసంగా 'నన్ను—తనవి' చేసుకున్నాడు.

ఆ రాత్రి—

మొట్టమొదటిసారిగా — నన్ను స్పృశిస్తూ నా చుట్టూ చేతులు వేసి నా నదుటను చుంబిస్తూ—

''కరుణా! నీకు గుర్తుందా మన మొదటి పరిచయంనాడు నిన్ను గుర్తుపెట్టుకోమన్న క్షణం. బస్ స్టాప్‌దగ్గర (నాకు గుర్తుంది)''

ఎందుకో తెలుసా? ఆరోజు నువ్వు నా అభ్యర్థనను మన్నించి నన్ను కరుణించినందులకు నీకో బహుమతి ఇవ్వాలనిపించింది. కానీ అప్పుడా బహుమతి ఇచ్చివుంటే నువ్వు నా చెంప పగిల్చేసి కారుదిగేసి వుండేదానివి. అందుకే ఆ క్షణాన్ని గుర్తుపెట్టుకోమన్నాను. ఇదిగో అప్పటి ఆ బహుమతి. ఇన్నిరోజులుగా దాచడంవలన అది వడ్డీ, చక్రవడ్డీ, బారువడ్డీలుగా పెరిగి పెరిగి ఇదిగో ఇలా... ఇలా-"

అంటూ గుబుక్కున నా పాపిట మొదలునుండి మొదలుపెట్టి అనువణువుగా ప్రతి అణువు తనువుతనువునంతా తన పెదువులతో తడిపివేస్తూ అతనూ... అలా అలా బాప్‌రే! నేను నేనేపైపోతున్నానూ? ఒకానొక అనంతాద్భుత రసఝరికి — రేరాణినై—

ఒకానొక పారవశ్యపునదికి స్వర్ణానావలోని సుగంధినై నాకే తెలియని— నాలో దాగిన నులివెచ్చని ప్రవాహపు పొంగు మోహమై అతని స్పర్శలకే చలించి, జ్వలించి ప్రజ్వరిల్లి ప్రగాఢ గాఢ వెల్లువ వత్తిడిలో విస్ఫోటనమై పగిలి, రగిలి, ప్రకంపించి, సొమ్మసిల్లిపోతే!! ఆపై సేదకై అప్పుడే పొందిన అతని ఎదకానుకపై ఒదిగి తృప్తిపొందితే ఓం శాంతి శ్శాంతి శ్శాంతి. ఇంతేనా? ఇంతానుభూతి మాటున ఇన్ని పరిమళ పుప్పొడుల మాటునా ఓ నిధి. అతని సన్నిధి.

ఈరోజునుండీ నా ఒంటరి బ్రతుకు కతడు తోడు నీడ నా ఆలోచనలూ, ఆత్మీయతా అనురాగం పంచుకునే ఆత్మబంధువు. ఈ జనారణ్యంలో నా మానానికీ, ప్రాణానికీ రక్షకుడు. ఈ సంఘంలో నా ఉనికికి విలువా, గుర్తింపులకు కారకుడు. ఇతనూ ఇతనే కదూ నా ఆలోచనలన్నీ అలా అలా 'మోనుందా'లై

విరుస్తున్నవేళ—

"మనపేర్లు కలవలేదన్నావుకదూ?" ఇంకా విడువడలేని అతని మమతతో, తపనలో అతని మాట విని మరింత సిగ్గుగా చిన్నిపాపలా అతని గుండెల్లో నన్ను నేను దాచుకున్నాను. ఆనాటినుండీ నా జీవితమే మారిపోయింది. నన్నా చిన్నిపాపలా తన అనురాగపు ప్రతిమలా, నన్నత్యంత అపురూపంగా లాలిస్తుంటే—

"నాకిలా చాలా... చాలా బావుంది తెలుసా?" అనేదాన్ని.

'అదివిని యూ మై స్వీట్ చైల్డ్' అంటూ నా నుదుట ముద్దిడేవాడు.

మాకు కాలం కలలా కరిగిపోతోంది. వసంతం నా నుదుట సింధూరమై మెరుస్తోంది. మాకు రుతువులన్నీ కలసిపోయి ఒక్క వసంతమన్నట్లుగా వుంది.

కానీ వసంతాన్ని మింగే శక్తి గ్రీష్మానికుందని తెలిసేసరికి కాలం గిర్రున మూడు సంవత్సరాలు తిరిగిపోయి అక్కడ నిలిచిపోయింది. కాదు. నేనే వసంతాన్ని ఆపేశాను. ఎలా అంటే—

ఆరోజు మామయ్య మా ఇంటిని వెతుక్కుంటూ వచ్చాడు.

ఓ గృహిణిలా చాలా ఆదరంగా ఆహ్వానించాను.

కుశల ప్రశ్నలూ, ఫలహారాలూ అయిన తర్వాత—

"అబ్బాయేడమ్మా కనిపించలేదూ!"

"కేంప్ కెళ్ళారు మామయ్యా"

"ఆహా... ఎప్పుడెప్పుడుంటాయేంటీ కేంపులు?"

"నెలకోసారి"

"ఎన్నిరోజులు?"

"రెండుమూడురోజులు"

"నువ్వూ కూడా వెళ్ళొచ్చుగా?" మామయ్య అమాయకతకు నవ్వొచ్చింది.

'కేంప్ అంటే హనీమూన్ కాదు మామయ్యా' అనలేదు మరి.

"నిన్నెలా చూసుకుంటాడూ?"

"నన్నా?" మనసులో ప్రశ్నించుకున్నా.

మా ప్రగాఢ మమైక ఏకత్వాన్ని ఏ భాషలో అయినా, ఏ కంటి చివర మెరుపులోనైనా ఏ పెదవుల మధ్య బిగించిన



## బర్త్

"ఏమిటీ అప్పర్ బర్త్ మీద ప్రయాణం చేసొచ్చారా. పోనీ లోవర్ బర్త్ వాళ్ళని రిక్వెస్ట్‌చేసి మార్పించు కోలేకపోయారా?" అయోమయం తండ్రితో అన్నాడు కొడుకు కైలాసం.

"నాకామాత్రం తెలీదనుకున్నావురా వెధవాయ్. రిక్వెస్ట్ చేద్దామంటే లోవర్‌బర్త్‌లో ఎవరైనా వుంటేనా. నాదంతా ఖాళీగానే ఏడ్చింది" గొప్పగా అన్నాడు అయోమయం తండ్రి.

ఎస్.శక్తినాథ్ (బాపట్ల)

మనోహర నవ్వుతోనైనా నేనెందుకు చెప్తానూ. నేను అతనికి మాత్రం కనిపించే కరుణను. అయితే—

నా మౌనాన్ని చూసి మామయ్య ఏమనుకున్నారో మరి.

''అందుకే తల్లీ. ఇల్లెతుక్కుని మరీ వచ్చింది'' అన్నాడు.

''ఎందుకూ?''

''ముందు హోటల్లో అబ్బాయిపక్కన అమ్మాయినిచూసి నువ్వే అనుకున్నా. అనుకుని దగ్గరకెళ్ళబోతే అంతలో ఆ పిల్ల వెనక్కి తిరిగింది. నువ్వుకాదు. నాకు షాక్కొట్టేసిందనుకో. ఆ తర్వాత వాళ్ళిద్దరూ రూంలోకెళ్ళిపోయారు. మీ ఆయన నన్ను చూళ్ళేదు. అక్కడికీ అనుమానం చాలక ఆ హోటల్ వాళ్ళను అడిగితే పేరు చెప్పారు. మిస్టర్ అండ్ మిసెస్ సంకేత్.

ఇప్పుడు షాక్ నాకు.

''నేను నమ్మనూ, నమ్మనూ, నమ్మలేను'' హిస్టీరిక్‌గా గట్టిగా అరిచేశాను.

''నేనూ అలాగే అనుకున్నాను. అప్పుడు అక్కడ ఇంకా వివరాలు సేకరించాను. అతను ప్రతినెలా ఆ అమ్మాయితో అక్కడికి వస్తాడట. రెండుమూడు రోజులుగడిపి వెళ్ళిపోతారంట. అక్కడంతా వాళ్ళిద్దరూ భార్యభర్తలనుకుంటున్నారు''

''మామయ్యా ఇది నిజమా?''

''ఇదిగో కావాలంటే అతను హోటల్లో వున్న డేటూ రోజూనూ''

చిన్న పుస్తకం డైరీలాంటిది తీసి చూపాడు.

పోయినసారి కాంప్‌కెళ్ళిన తేదీ నా విరహపు రాత్రులు నాకు గుర్తుండవా?

''బాధపడకు తల్లీ. ఆవేశం అసలే వద్దు. సమస్యెంత పెద్దదయితే సహనమంతెక్కువ చూపాలి. నువ్వు కురూపివీ, అవివేకివీ కాదు. ఏదో చిన్న గ్రహపాటు. సామరస్యంతో నెగ్గు. నాకు నువ్వొహటీ, నాకూతురొహటీ కాదు. అందుకే ఎంతోకాలం కడుపులో దాచుకోలేక ఇలా వచ్చాను''

నాకు ప్రాణం మరగిపోతోంది.

మొట్టమొదటిసారిగా నేను నా అద్భుత, అపురూప, అనురాగపు 'సెల్'నుండి బయటకు వచ్చాను.

నాకిప్పుడు అర్జెంటుగా సంకేత్‌ని చూడాలని వుంది.

అడిగెయ్యాలి. అడిగెయ్యాలి. నాకు దాచడం, నటించడం, మింగడం చేతకాదు.

అసలు ఇప్పుడే, నేనే అక్కడకు వెళ్తే?

ఎక్కడకు? తనకావూరిపేరు చెప్పాడుగా. మిగిలిన అడ్రస్ మామయ్యదగ్గర తీసుకుని.

''ఒద్దుఒద్దు'' మామయ్య అడ్డుపడుతున్నాడు.

రెండు యుగాల నరకపురోజుల అనంతరం అతనొచ్చాడు.

ఇప్పుడు నేను వసంతంలా చుట్టుకుపోలేదు.

మనసులో బాధ, ఉద్రేకం.

అడిగెయ్యాలి.

అల్లరి చేసిందనుకుని తల్లి కొడ్తుంటే—

'నన్ను కొట్టొద్దమ్మా' అంటూ ఆ తల్లి

కాళ్ళకే చుట్టుకుపోయేపసిపాపలా వుంది నా పరిస్థితి.

అంతే కూలిన సన్నజాజి తీవెలా అతని సన్నిధిలో ఒరిగిపోయాను. అనంతమైన నా దుఃఖం ఓ సముద్రంలా నా గుండెనావను కుదిపేసింది. ఎక్కిళ్ళ తెల్లతో ఏ దరికి వెళ్తాను నేను?

''కరుణా ఏమైంది. ఏమైంది తల్లీ?'' తను తడివిపోతూ, కూలిన నన్ను లేవనెత్తి, గుండెకు బలంగా అదుముకుని అడుగుతుంటే— ఏడ్పూ, వెక్కిళ్ళమధ్య నేను విన్నదంతా చెప్పేసి—

"నిజమా? నిజం కాదుకదూ సంకేత్?''

అదే ప్రశ్న. అదే జవాబు కావాలనే ఆశ నాది.


క్షణకాలం. ప్రపంచమంతా మౌనం పాటించుతున్నంత మౌనం ఆ ముఖంలో తాండవించి నిష్క్రమించిన తర్వాత—

నన్ను నెమ్మదిగా సోఫాలో కూర్చోబెట్టి, నా తలను అతని ఒడిలో అదిమి, నా శిరస్సు నిమురుతూ అతను చెప్పిందిది.

నేను విన్నది నిజమేనట. ఆ అమ్మాయి సంకేత్ క్లాస్‌మేట్ ప్లస్ లవర్. ఈ సంగతి వాళ్ళింట్లో తెలిసి కులాలు వేరని అమ్మాయికి బలవంతంగా పెండ్లి చేశారట. చాన్నాళ్ళ తర్వాత ఆ అమ్మాయి భర్తకు వాళ్ల ప్రేమలేఖలు కన్పించి నిలదీస్తే ఆ అమ్మాయి నిజం చెప్పేసిందట. అతను వదిలేసాడుట. పుట్టింటివాళ్ళు రానివ్వలేదుట. చచ్చిపోదామంటే వీల్లేకుండా ఆ అమ్మాయికో కొడుకున్నాడట. ప్రస్తుతం చిన్నఉద్యోగం చేసుకుంటూ బాబుకోసం బ్రతుకుతోంది. ఇంత అందాల, ఆకర్షణ, కోరికల ప్రపంచంలో అన్నీ పోగొట్టుకునీ, ఏవీలేనిదానిలా అడవినకాచే వెన్నెల్లా ఆమె జీవితం మిగిలిపోవడానికి కారణం ఎవరూ? కేవలం తనూ. తన పిరికితనమేనట. ఇది ప్రతి ప్రేమికుల విషయంలో జరిగే పాతకథే. అయితే సంకేత్ దీనికో కొత్త పరిష్కారం చూపి ఆచరిస్తున్నాడు. నాకు నా గుండె ఖజానా కొల్లగొట్టబడిన భావన.

కానీ నేను ఆ పరిష్కారాన్ని ఆమోదించడానికి ఒప్పుకోలేదు. నేనేకాదు. ఎవరుమాత్రం అంగీకరిస్తారు. తనమూలంగా ఆ అమ్మాయి సర్వం కోల్పోయింది కనుక, నెలలో ఒక్క రెండురోజులుమాత్రం వావి

## తేలే కొండ



భూమ్మీద కొండ కన్పిస్తే అది సాధారణం కావచ్చు. కానీ నీళ్ళమీద కొండ కన్పిస్తే అసాధారణమే! అలాంటి అసాధారణ పర్వతం 1956లో ఉత్తర అట్లాంటిక్ సముద్ర ప్రాంతంలో అయిస్‌బర్గ్‌లో కనిపించింది. ఇది మంచుకొండ. ఈ కొండ 208 మైళ్ళ పొడవు, 60 మైళ్ళ వెడల్పు, 1200 చదరపు మైళ్ళ విస్తీర్ణంతో వుంది. ఈ కొండ అలాగే నిలిచి వుండడం అనేది వింతే అయినా అది ఎక్కువకాలంపాటు వుండదని నిపుణులు అంటున్నారు.

కాదనుకోవాలి. అతని తృప్తికోసం.. నో... నేనొప్పుకోలేదు.

సంకేత్ తన నిర్ణయాన్ని మార్చుకోనన్నాడు.

మేమీ విషయాలన్నీ చాలా నిశ్శబ్దంగా చర్చించుకున్నాం. నేను అరవలేదు. అతను రెచ్చిపోలేదు (వెక్కిళ్ళుమాత్రం ఆగడంలేదు) సంకేత్ ఏం చెయ్యాలనుకుంటాడో అది చాలా కూల్ గా చేసేస్తాడు. ఆ స్టయిల్ చాలాబావుంటుంది. అందుకు ఒక ఉదాహరణ నాపెండ్లి. రెండోది ఆ అమ్మాయితో అతని అనుబంధం.

తనని నేనెలా బంధీ చేయనూ? మనసుకు సంకెళ్ళు వేయగలమా?

ఫలితం. ఆ క్షణంనుండి నేనతనికి దూరంగా వుండసాగాను. సంకేత్ మాత్రం తానేదో పెద్ద తత్త్వవేత్తలా నేను సర్దుకోవాలనీ, రాజీపడాలనీ గొప్పగా బుజ్జగిస్తున్నాడు నన్ను.

గుండె కాలిపోతోందని నేనేడుస్తుంటే తన కౌగిలి ఉద్రేకపు వెన్నెలలో చల్లార్చుకోవాలంట. కానీ తనుమాత్రం నాగుండెమంటను చల్లార్చడట. బావుందికదూ?

ఆ మరునాడు నా పుట్టినరోజు.

ప్రతి సంవత్సరం నాకిష్టమైంది అడిగి తెలుసుకుని అది ఇస్తూవుండడం సంకేత్ కి అలవాటు.

''కరుణా... ఈసారి నీకేంకావాలి. కోరుకో. బంగారుపాపనడగవూ?'' మా మధ్యేం స్పర్ధలు లేనట్లే అడిగాడు.

ఇతన్ని ఎలా అర్థం చేసుకోనూ? ఉక్రోషంగా నాకేమొద్దని చెప్పేసాను. వినలేదు. నన్ను బలవంతంగా తన గుండెకదుముకుని, నా పాపిట ముంబిస్తూ—

''అయ్ లవ్యూ — అయ్ లవ్యూ. చెప్పు కరుణా. ఏంకావాలి నీకు? నువ్వు కోరుకోపోతే నామీద ఒట్టే''

నాకేదుపొచ్చేసింది. మనసేద్చేస్తోంది. నేనతని గుండెనుండి కాస్త తలపైకెత్తి అతని ముఖంలోకి చూస్తూ చెప్పాను.

''నన్ను తాకకుండా ఒదిలేయండి'' ఈమాట చెప్పేటపుడు ఎన్నివేల అగ్నిగోళాలు నాలో ప్రజ్వరిల్లేయో నేనెలా చెప్పనూ. అంతే. ఠక్కున నాకంతవరకూ కోటలా బంధించిన అతను తన చేతులు వదిలి ఒక్కడుగు వెనక్కి వేశాడు. ఆరోజునుండి ఇప్పటికి ఎనిమిది నెలలు.

ఒక్కటనుకున్న ఆత్మ శరీరాలు రెండయి వేరువేరుగా ఒకే ఇంట్లో. నాకు తెలుసు.

సంకేత్ కి నామీద ప్రేమ తగ్గదని.

సంకేత్ కీ తెలుసు, అతన్ని చూడకపోతే నాకు బ్రతుకే లేదనీ, వూపిరి అందదని. మేము ఇప్పుడు సమాంతర రేఖలం.

కలవం. విడిపోం.